క్లుప్తంగా

మాజీ మంత్రి 'పెద్దిరెడ్డి'ని కలసిన జిల్లా నేతలు


మాజీ మంత్రి రామచంద్రారెడ్డిని కలసిన విశ్వరూప్, జగ్గిరెడ్డి తదితరులు

అమలాపురం టౌన్: తన కుమారుడు, ఎంపీ మిథున్‌రెడ్డిని చూసేందుకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు వద్దకు వచ్చిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని జిల్లా వైఎస్సార్ సీపీ నేతలు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ పీఏసీ సభ్యుడు, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్ పినిపే విశ్వరూప్, జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, అమలాపురం నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్‌లు మాజీ మంత్రి రామచంద్రారెడ్డిని కలసి మాట్లాడారు. వారితో పాటు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, కర్రి నాగిరెడ్డి తదితరులు మాజీ మంత్రి రామచంద్రారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

నేడు 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమం

ఐ.పోలవరం: మండల పరిధిలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పిన్నమరాజు వెంకటపతిరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ పరిశీలకులు మాత మురళి, జెడ్పీటీసీ సభ్యుడు సతీష్ రాజు, ఎంపీపీ మోర్తా రాణి మిరియం జ్యోతి సమక్షంలో ఆయన బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారంటీ షెడ్యూలు విడుదల చేశారు. బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు ఎదుర్లంక, 11 గంటలకు పాత ఇంజరం, మధ్యాహ్నం 2 గంటలకు కొమరగిరి, సాయంత్రం 4 గంటలకు పశువుల్లంకలో జరుగుతోందని తెలిపారు. 12వ తేదీ ఉదయం 9 గంటలకు మురమళ్ల, 11 గంటలకు పోలవరం, మధ్యాహ్నం రెండు గంటలకు టి. కొత్తపల్లిలో జరుగుతోందన్నారు. 16న తొమ్మిది గంటలకు భైరవపాలెం, మధ్యాహ్నం నుంచి కేశనకుర్రు, తిల్లకుప్పలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మండల, గ్రామ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

గురుకులంలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అల్లవరం: గోడిలోని బాలురు గురుకులంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో 52 సీట్లు, ఆరో తరగతిలో 12 ఖాళీలు, 9వ తరగతిలో 6 ఖాళీలు, పదో తరగతిలో 37 ఖాళీలు ఉన్నాయి. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఎంపీసీ 27, బైసీపీలో 12 సీట్లు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ 7, బైపీసీలో 17 సీట్లు ఖాళీలు ఉన్నాయని ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఎస్సీ అభ్యర్థులు ఈ నెల 7వ తేదీ లోగా ప్రిన్సిపాల్ సమక్షంలో అడ్మిషన్ పొందవచ్చన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

అమలాపురం రూరల్: మహిళలకు రక్షణ కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగాఅమలు చేస్తున్న డీఎస్పీ టీఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం శక్తి ప్రోగ్రాంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్ఎం ఎల్.రాణి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సైబర్ నేరాలను నియంత్రించేందుకు, వరకట్నం, గృహహింస వేధింపుల నుంచి బయటపడేందుకు, మహిళ అక్రమ రవాణాను నిరోధించేందుకు ఈ శక్తి యాప్ ఎంతగానో దోహదపడుతుందని డీఎస్పీ చెప్పారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్, ఎస్సైలు శేఖర్ బాబు, గంగాభవాని, పాఠశాల ఉపాధ్యాయుడు పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐస్ బాక్స్‌ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

యానాం: చేపలు విక్రయించేవారు, వర్తక సంఘంలో సభ్యులై ఉంటే చేపలు నిల్వ ఉంచే ఐస్ బాక్స్‌ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని మత్స్యశాఖ ఏడీ దడాల గొంతియ్య ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఆగస్టు 6వ తేదీ నుంచి 20 లోపు మత్స్యశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఆసుపత్రి ఖర్చులకు ఆర్థిక సాయం

కాట్రేనికోన: కోనసీమ అగ్నికుల క్షత్రియ సంఘం జిల్లా కార్యదర్శి అవనిగడ్డ నారాయణరావు ఆధ్వర్యంలో యువకులు క్యాన్సర్ బాధితుడు సంగాని బాజీరావు(23)కు రూ.70 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కత్తిమండకు చెందిన సంగాని నరసింహాస్వామి, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో పెద్దకుమారుడు బాజీరావు కేన్సర్ వ్యాధి సోకింది. నిపేద కుటుంబానికి చెందిన బాజీరావు సోదరుడు కోనసీమ అగ్నికులక్షత్రియ సంఘం సభ్యులను కలిసి విషయం తెలిపారు. పల్లం, నీళ్ళరేవు, చిర్రయానం గ్రామాలకు చెందిన సంఘం సభ్యులు దాతల నుంచి ఆర్థిక సహాయాన్ని సేకరించారు. రూ.70 వేలను బాధితుని సోదరుడుకు అందచేశారు. అగ్నికుల క్షత్రియ సంఘం యువత మల్లాడి దయ, శ్రీరాములు, దండుప్రోలు రామరాజు, నాయకర్, రాజు,చిన ధనుంజయ తదితరులు ఉన్నారు.

చంద్రబాబు మోసాల ఉచ్చులో పడొద్దు


అమలాపురంలో బాబు మోసాల క్యూఆర్ కోడ్ పత్రాలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు


గోడిలో కూటమి ప్రభుత్వ మోసాలపై క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్


కామనగరువులో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొనన పినిపే శ్రీకాంత్, నాయకులు

- ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు
- పట్టణంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం

అమలాపురం టౌన్: చంద్రబాబు మోసాల ఉచ్చులో ఈసారి పడి భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసుకోవద్దని ప్రజలకు ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు సూచించారు. అమలాపురం పట్టణం 12, 13, 15, 16 వార్డుల్లో మంగళవారం జరిగిన ×బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ¥ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత స్థానిక సూర్యనగర్‌లోని వినాయక ఆలయం వద్ద వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ చంద్రబాబు మహిళలు, నిరుద్యోగులు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజలకు హామీలు ఇచ్చేసి అధికారం చేపట్టాక ఏరు దాటి తెప్ప తగలేసినట్టు నయవంచన చేశాడని ఎమ్మెల్సీ ప్రజలకు గుర్తు చేశారు. సమావేశంలో చివరిగా ఎమ్మెల్సీతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో బాబు మోసాలతో ఉన్న క్యూఆర్ కోడ్ పత్రాలను ప్రదర్శించి ప్రజలను చైతన్య పరిచారు. అనంతరం ఆ నాలుగు వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాల చిట్టాను వివరించి ఈసారి మోసపోవద్దని హితవు పలికారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్‌లు క్యూఆర్ కోడ్ పత్రాలను ప్రజలకు పంచిపెట్టి బాబు మోసాలపై వారికి అవగాహన కల్పించారు. మున్సిపల్ కౌన్సిలర్లు వాసర్ల లక్ష్మి, గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు, నాగారపు వెంకటేశ్వరరావు, చిత్రపు రామకృష్ణ, కట్టోజు సన్నయ్యదాసు, కొల్లాటి దుర్గాబాయి, పార్టీ సీనియర్ నాయకులు వేగిరాజు సాయిరాజు, కముజు రమణ, కుడుపూడి భరత్ భూషణ్, విత్తనాల మూర్తి, కల్వకొలను ఉమ, భరణికాన బాబు, ఇలకోటి రాంబాబు, యండమూరి శ్రీను, కట్టోజు రాము, మాజీ కౌన్సిలర్లు సంసాని శ్యామలాదేవి, కాండ్రేగుల రేవతి తదితరులు బాబు మోసాలను గడపగడపకూ తీసుకువెళ్లారు.

హామీలతో ప్రజలకు మోసం : వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీకాంత్

అమలాపురం రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. అమలాపురం మండలంలో గ్రామాల్లో కామనగరువు, వన్నెచింతలపూడి, చిందాగడరువు, తాండవపల్లిల్లో మంగళవారం బాబు షూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ఎన్నికల్లో జగన్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలతో పాటు సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 14 నెలలు కావస్తున్న ఏ ఒక్క పథకం సక్రమంగా అమలుచేయలేదన్నారు. చంద్రబాబు, పవన్ వైఫల్యాలను బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం ద్వారా కార్యకర్తలు గ్రామస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని ప్రజల్లో ఎండగడుతూ రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ కూటమి ప్రభుత్వం వైఫల్యాలను, మోసపూరిత హామీలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు గుత్తుల చిరంజీవిరావు, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, మాజీ జెడ్పీటీసీ కుడుపూడి వెంకటేశ్వరబాబు,జిల్లా మాజీ కార్యదర్శి సరేళ్ల రామకృష్ణ, సర్పంచ్‌లు, పొణకల గణేష్, గంగుమళ్ల ఏసుబాబు, నక్కా అరుణకుమారి, ఉప సర్పంచ్‌లు రాజులపూడి భాస్కరరావు, యూత్ విభాగం అధ్యక్షుడు కేతా భాను, ఎంపీటీసీలు మెండుగంగా భవాని, చొల్లంగి సుబ్బిరామ్, పరమట నాగమణి, రేవు శ్రీను, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజులపూడి మురళి, కలిదండి బాబు, నాయకులు ములపర్తి శ్రీను,దాసరి డేవిడ్, చిక్కం సూరిబాబు, మాజీ సర్పంచ్ ములపర్తి సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్రివానిరేవులో...


సమావేశంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

ముమ్మిడివరం: కర్రివానిరేవులో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు సమావేశం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కాశి బాగ్యలక్ష్మి జగపతిరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో రావడం కోసం మోసపూరితమైన హామీలు ఇచ్చి ప్రజల్ని మోసం చేసిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలలో బాగంగా తల్లికి వందనం, ఉచిత బస్సు, స్త్రీ శక్తి, అన్నదాత, సుఖీభవ, వంటి అనేక పథకాలు అమలుచేయకుండా ప్రజల్ని మోసం చేశారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు జగతా పద్మనాభం మాట్లాడుతూ పార్టీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి చంద్రబాబు చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోలా గంగాభవానీ, కోలా బాబ్జి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాయపురెడ్డి జానకీరామయ్య, వైస్ ఎంపీపీలు పాము నాగవేణి, చిట్టిబాబు, మట్టపర్తి సురేష్; ఎంపీటీసీ గిరిగి దుర్గా వీరకుమారి, బొంతు శ్రీనివాస్, చింతా నాగమునీంద్రరావు, మోర్త వీరభూర్యం, పులిదిండి సురేష్, కలాడి దుర్గాప్రసాద్, చెల్లి ఏడు కొండలు తదితరులు పాల్గొన్నారు.

విశ్వసనీయతకు మారు పేరు జగన్‌మోహన్‌రెడ్డి

బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: విశ్వసనీయతకు మారు పేరు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన హయాంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తుచా తప్పకుండా అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని గెలుసుకున్నారని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ అన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో మొగళ్ళమూరు, గోడిలంక, గోడి గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ విశ్వసనీయత లేని వ్యక్తి చంద్రబాబు అని, ఈ రాష్ట్ర ప్రజలను ఎలా మోసం చేయాలి, సంక్షేమ పథకాలను ఎలా కోత వేయాలనే విషయాలను తప్ప ప్రజల క్షేమాన్ని పట్టించుకోరాన్నారు. అధికారం కోసం ఎన్ని అబద్దాలనైనా మాట్లాడుతారని, తీరా అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని, లేదా ఈ రాష్ట్రాన్ని అమ్మేయాలని ప్రజలే అర్థం చేసుకోవాలని ముసలి కన్నీరు కారుస్తాడని అన్నారు. ప్రశ్నించడానికే రాజకీయాల్లోకి వచ్చానని ప్రజలను నమ్మించి తీరా ప్రశ్నించే సమయానికి పవన్‌కల్యాణ్ ముఖం చాటేస్తున్నాడన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలులో మోసం చేసిందన్నారు. ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడు ఇస్తున్నారో ప్రశ్నించాలని ఎమ్మెల్సీ పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించాలన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, వైఎస్సార్ సీపీ పార్టీ రాష్ట్ర నాయకులు నాతి శ్రీనివాసరావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతా రామకృష్ణ, సీనియర్ నాయకులు తిక్కా ప్రసాదు, కర్రి వెంకట రామారావు, సర్పంచ్‌లు రాయుడు విష్ణు, రాపాక విజయలక్ష్మి, బర్రే సీతారత్నం, ఎంపీటీసీలు పులుసుగంటి రాజేశ్వరి, మాకే కృష్ణమూర్తి, మాజీ సొసైటీ అధ్యక్షుడు కాండ్రేగుల జవహర్, గ్రామకమిటీ అధ్యక్షుడు కాశి చిరంజీవి, దొమ్మేటి వెంకటేశ్వరరావు, వడ్డి వెంకటేష్, కడలి ప్రసాదు, సాధనాల శ్రీను, రేవు శ్రీను, జల్లి ఏడుకొండలు, చిట్టిబాబు, కొల్లు వెంకటరమణ, మల్లవరపు శ్రీను, రొక్కాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాత రైల్వే లైన్ కొనసాగించాలని వినతి

అమలాపురం రూరల్: కొత్తది కాకుండా పాత కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్‌ను కొనసాగించాలని అమలాపురం, అల్లవరం మండలంలో రైతులు కలెక్టర్‌ను కోరారు. కొత్త రైల్వే లైన్ వల్ల 12 గ్రామాలకు మంచినీటిని సరఫరా చేసే చిందాడగరువు వాటర్ ప్రాజెక్ట్ దెబ్బ తింటుందని, 1000 సంవత్సరాలు చరిత్ర కలిగిన చిందాడ మడుగు కనుమరుగయ్యే పరిస్థితి ఉందని, పురాతనమైన అమలేశ్వరస్వామి దేవాలయం, చిందాడ మడుగు ఘాట్ మరుగు పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త రైల్వే లైన్ వల్ల రైతులు భూములు నష్టపోతున్నారని కలెక్టర్‌కు వివరించారు. గతంలో కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైను నిర్మాణంలో భట్నవిల్లి నుంచి పేరూరు మీదుగా పాశర్లపూడికి ఒక రైల్వే లైను ప్రతిపాదన చేశారని, రైల్వే లైన్ కోసం భూ సేకరణ కోసం సర్వే నంబర్లతో మార్కింగ్ చేశారని తెలిపారు. ప్రతిపాదనను రైల్వేకు ప్రభుత్వం వద్ద డిపాజిట్ చేసినట్టుగా వారు తెలిపారు. కొత్త రైల్వేలైన్ ప్రతిపాదన వల్ల ఇళ్లు భూములు నష్టపోతున్నారని, అంతేకాకుండా రైల్వే లైన్‌కు సమాంతరంగా జాతీయ రహదారి 216 మూడు చోట్ల రైల్వే లైన్ క్రాసింగ్ వస్తోందని, దీని వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడతారని తెలిపారు. పేరూరులో ఫుడ్ కార్పొరేషన్ గోడౌన్ దూరమై భవిష్యత్తులో వాటి కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. పాత ఎలైన్ మెంట్‌ను కొనసాగించాలని పలువురు బాధిత రైతులు మంగళవారం కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా కలెక్టర్ స్పందించి రెండు లైన్లు సర్వే చేస్తామని హామీ ఇచ్చారు. న్యాయవాది, నల్లా ప్రభాకరరావు, రైతులు ఆరవ పూర్ణచంద్రరావు, మట్టా సాయి రామారావు,జక్కపు సత్యవతి, తిరునాధం మురళి, జక్కపు స్వాతి,రంకిరెడ్డి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విధులను సమర్థవంతంగా నిర్వహించాలి


ఎంపికైన కానిస్టేబుళ్లను అభినందిస్తున్న జిల్లా ఏఎస్పీ ప్రసాద్

అమలాపురం టౌన్: పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులై కొత్తగా ఉద్యోగాలు సాధించిన పోలీస్ కానిస్టేబుళ్లు ఇక నుంచి విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ పోలీస్ శాఖకు గౌరవాన్ని మరింత పెంచాలని జిల్లా ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్ సూచించారు. స్థానిక బీటీసీ ఇనిస్ట్యూట్‌లో శిక్షణ పొంది 11 మంది అభ్యర్థులు పోలీస్ కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారిని ఏఎస్పీ ప్రసాద్ మంగళవారం అభినందించారు. స్థానిక ఎస్పీ కార్యాలయానికి వచ్చిన 11 మంది పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగార్థులను ఏఎస్పీ ప్రసాద్ సత్కరించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచి సీఐ బి.రాజశేఖర్ తదితరులు పాల్గొని కొత్తగా బాధ్యతలు తీసుకోనున్న కానిస్టేబుళ్లను అభినందించారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వర అన్నదాన ట్రస్టుకు మంగళవారం ఓ దాత విరాళం అందించారు. హైదరాబాద్‌కు చెందిన బొత్స జయప్రసాద్ దంపతులు రూ.10,116ను వీరేశ్వర అన్నదాన ట్రస్టుకు అందించారు. ఈ సందర్భంగా దాతలకు స్వామి చిత్రపటం, శేష వస్త్రం, ప్రసాదం అందించి సత్కరించారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో దాతకు ప్రత్యేక దర్శనం చేయించారు. ఈవో వి.సత్యనారాయణ దాతను అభినందించారు.

పంచాయతీల్లో ప్రశాంతంగా గ్రామసభలు


పటవల గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీపీ రాయుడు సునీత

తాళ్లరేవు: మండల పరిధిలోని మూడు గ్రామ పంచాయతీలలో మంగళవారం సామాజిక తనిఖీ గ్రామ సభలు ప్రశాంతంగా జరిగాయి. పటవల పంచాయతీలో సర్పంచ్ పినపోతు చినకామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన గ్రామసభకు ఎంపీపీ రాయుడు సునీత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పటవల నుంచి శాంతిమూల వరకు రూ.2.13 కోట్లతో రహదారి నిర్మించామన్నారు. అలాగే మరో రూ.30 లక్షలతో అంతర్గత రహదారులు నిర్మించినట్టు తెలిపారు. పనులను మరింత పారదర్శంగా చేయాలని ఆదేశించారు. అలాగే పి.మల్లవరం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పంపన రామకృష్ణ, గాడిమొగ పంచాయతీలో సర్పంచ్ కామాడి గోవలక్ష్మి అధ్యక్షతన సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించారు. ఏపీఎస్ఆర్ఈజీఎస్ ఏపీఓ తేజస్విని పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాలలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అర్ధాని రామరాజు, వెంకటరమణ, రమణమ్మ, నాయకులు ఉంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి నాగేంద్రప్రసాద్, టేకుమూడి ఈశ్వరరావు, భజన సత్తిబాబు వార్డు సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

టిడ్కో గృహ సముదాయంలో మౌలిక వసతులు

- జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్


బోడసకుర్రులో టిడ్కో గృహలను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అల్లవరం: బోడసకుర్రులోని టిడ్కో గృహ సముదాయంలోని లబ్ధిదారులు సమస్యలను పరిష్కరించడానికి అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మహేష్ కుమార్ అన్నారు. అమలాపురం మున్సిపాలిటీ పరిధిలో ఇళ్లు లేని నిరుపేదల కోసం బోడసకుర్రు వద్ద నిర్మించిన టిడ్కో గృహాలను మంగళవారం అధికారులతో కలసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా టిడ్కో గృహాల లబ్ధిదారుల నుంచి సమస్యలను తెలుసుకున్నారు. టిడ్కో గృహ సముదాయంలో తాగునీటి సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కారం చూపుతామని, మురుగునీరు బయటకు వెళ్లేందుకు మార్గాన్ని సూచిస్తామని భరోసా ఇచ్చారు. టిడ్కో గృహ సముదాయంలో సమస్యలను పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. ఆయన వెంట డీఆర్ఓ మాధవి, మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్, తహసీల్దార్‌లు అశోక్ ప్రసాద్, వీవీఎల్ నరసింహరావు, టిడ్కో ఏఈ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి


నాగేశ్వరరావు, త్రిమూర్తులను సత్కరిస్తున్న శ్రీకాంత్, శ్రీనివాసరావు తదితరులు

అమలాపురం రూరల్: పదవులు పొందిన నాయకులు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల కామనగరువు చెందిన వైఎస్సార్ సీపీ కోనసీమ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన రాజులపూడి నాగేశ్వరరావు, రూరల్ మండల ఉపాధ్యక్షుడు బడుగు త్రిమూర్తులును కో-ఆర్డినేటర్ శ్రీకాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావులు మంగళవారం అభినందించారు. కామనగరువులో మర్యాద పూర్వకంగా నాగేశ్వరరావు, త్రిమూర్తులు శ్రీకాంత్, పార్టీ నాయకులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు, త్రిమూర్తులను శ్రీకాంత్ పూలమాలలు, శాలువతో సత్కరించారు. జెడ్పీటీసీ పందిరి శ్రీహరి, ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, రూరల్ మండల అధ్యక్షుడు గుత్తుల చిరంజీవిరావు, మాజీ జెడ్పీటీసీ కుడుపూడి బాబు, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజులపూడి మురళీ కృష్ణ, ఉప అధ్యక్షుడు పమ్మి తాతాజీ, ములపర్తి శ్రీను, ఎంపీటీసీలు మెండు గంగా భవాని, చొల్లంగి సుబ్బురామ్ చిక్కం సూరిబాబు, కుమ్మరి శ్రీను, రాయుడు శ్రీనివాసరావు, పందిరి సుబ్బరాజు, ఉర్రింగి నారాయణరావు పార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఐదుగురు హిజ్రాలపై కేసు


హిజ్రాలను అరెస్ట్ చేసి కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

తాళ్లరేవు: ఆంధ్రా-యానాం సరిహద్దులో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న ఐదుగురు హిజ్రాలను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్టు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాల మేరకు జాతీయ రహదారి 216లో యానాం బైపాస్ రహదారిలోని హిజ్రా స్థావరాలపై దాడి చేసి ఐదుగురు హిజ్రాలను అరెస్టు చేసి మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పితాని త్రినాథరావు వద్ద హాజరు పరచి బైండోవర్ చేసినట్టు తెలిపారు. అనంతరం హిజ్రాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

జిప్‌మెర్‌లో తల్లిపాల వారోత్సవాలు

యానాం: కేంద్ర ఆరోగ్యసంస్థ జిప్‌మెర్ ఆసుపత్రిలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. చీఫ్‌మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆనంద్ రాజ్ మాట్లాడుతూ తల్లిపాలు వల్ల శిశువు ఎదుగుదల ఆరోగ్యానికి కలిగించే ప్రయోజనాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.

జిల్లా ఫొటో, వీడియోగ్రాఫర్ల గౌరవాధ్యక్షుడిగా తాతాజీ

అమలాపురం టౌన్: జిల్లా ఫొటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా అమలాపురం పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ నియమితులయ్యారు. జిల్లా అసోసియేషన్ ప్రతినిధుల బృందం స్థానిక కల్వకొలను వీధిలో తాతాజీని మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి ఆయనను జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఎన్నుకుని అభినందించి సత్కరించారు. ఈనెల 19న జరగనున్న ఫొటోగ్రఫీ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాలని తాతాజీని ఆహ్వానించారు. జిల్లా ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు గెడ్డం సురేష్, జిల్లా గౌరవ సలహాదారులు సీవీ రావు, గీతా రమణ, జిల్లా కార్యదర్శి దొరబాబు, అమలాపురం అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కట్టమూరి కృష్ణ, అధ్యక్షుడు చెట్లుబోయిన బాబి తదితరులు తాతాజీని కలిశారు.

యువక్రీడాకారులకు పూర్తి సహకారం


క్రికెట్ కిట్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యేఅశోక్

యానాం: నియోజకవర్గ పరిధిలో యువక్రీడాకారులను ఆయా క్రీడల్లో రాణించేలా పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్అశోక్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఆర్థిక సహకారంతో సమకూర్చిన వేలాది రూపాయలు ఖరీదు చేసే క్రికెట్ కిట్లను దరియాలతిప్ప, కనకాలపేట, రమాభాయ్‌నగర్‌లో యువ క్రీడాకారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత మే లో వివిధ క్రికెట్ టోర్నమెంట్‌లలో ఆడుతున్న క్రీడాకారులకు క్రికెట్ కిట్లు ఇవ్వాలని తాను నిర్ణయించుకుని అందజేసినట్టుతెలిపారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రెండు ఆక్సిజన్ మెషీన్ల అందజేత


కాకినాడ జీజీహెచ్ మాతాశిశు విభాగంలో మెషీన్లు అందజేస్తున్న దేవిశ్రీ ప్రసాద్

కాట్రేనికోన: గచ్చకాయలపోర గ్రామానికి చెందిన సంగాని దేవిశ్రీ ప్రసాద్ మంగళవారం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి మాతాశిశు విభాగంలోని చిన్నారుల కోసం రెండు ఆక్సిజన్ మెషీన్లను తన కుమార్తె చేతుల మీదుగా అందజేశారు. ఇటీవల తన కుమార్తెను ఆసుపత్రికి తీసుకొని వెళ్లినపుడు చిన్నారులకు సరిపడ ఆక్సిజన్ మెషీన్లు అందుబాటులో లేకపోవడంతో పడుతున్న ఇబ్బందులు చూశానని, తన స్తోమతను బట్టి ఈమెషీన్లను అందించినట్టు దేవిశ్రీ ప్రసాద్ తెలిపారు.

క్రీడా సామగ్రి అందజేత


పిల్లలకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న పట్టణ సీఐ వీరబాబు, ఎస్సైలు కిషోర్‌బాబు, శ్రీనివాస్

అమలాపురం టౌన్: స్థానిక శ్రీకామాక్షీ పీఠంలో అనాథ పిల్లలు పెరిగే ప్రేమ మందిరాన్ని పట్టణ సీఐ పి.వీరబాబు, పట్టణ ఎస్సైలు ఎస్ఆర్ కిషోర్‌బాబు, టి.శ్రీనివాస్ మంగళవారం సాయంత్రం సందర్శించి పీఠంలో అందుతున్న సేవలను తెలుసుకున్నారు. అనాథ పిల్లలకు క్రీడా సామగ్రిని అందజేసి తమ వంతు వితరణ చేశారు. ఆ పిల్లలకు ఎలాంటి క్రీడా సామగ్రి కావాల్లో వారిని అడిగి మరీ సమకూర్చారు. ప్రేమ మందిరంలో ఆ పోలీస్ అధికారులు చాలా సేపు గడిపి అనాథ పిల్లలతో ఆనందంగా గడిపారు. పీఠం మేనేజర్ మర్రి దుర్గారావు సీఐ, ఎస్సైలకు కృతజ్ఞతలు తెలిపారు.

పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని ధర్నా


ఈదరపల్లి సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాలు

తాళ్లరేవు: ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని, వినియోగదారులకు భారంగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు వేయడాన్ని నిలిపివేయాలని కోరుతూ డిమాండ్ చేశారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ప్రజావేదిక ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయా డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని విద్యుత్‌శాఖ ఏఈకి అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వల్లు రాజబాబు, సంతోష్‌కుమార్, అదృష్టదీపుడు, వెంకటేశ్వర్లు, సుమన్, త్రిమూర్తులు, శ్రీనువర్మ, సత్యనారాయణ వినియోగదారులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

అమలాపురం రూరల్: విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, ఏఐటీయూసీ, వ్యవసాయ కార్మిక సంఘం రైతుసంఘం రిటైర్డ్ ఉపాధ్యాయుల సంఘం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అమలాపురం ఈదరపల్లిలో 132 సబ్‌స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. మాజీ ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తుందని అధిక విద్యుత్ చార్జీలు పెంచుతుందని వాటిని తగ్గించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి దేవరాజేంద్ర ప్రసాద్, ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కే. సత్తిబాబు, సీఐటీయు జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ రిటైర్డ్ ఉపాధ్యాయుల సంఘం నాయకులు పాల్గొన్నారు.